స్వాతి మాసపత్రిక - సెప్టెంబర్, 1976

# ఇదీ వుద్యోగమే!

సుబ్బావధాన్లకి పదహారేళ్ళు - అప్పటికే సుబ్బావధాన్లకి పెళ్ళిమంత్రాల్లో మూడొంతులూ, తద్దినపు మంత్రాల్లో సగం వచ్చేశాయి.... శ్రాద్ధ కర్మలు కూడా అటూ యిటూగా పూర్తయినట్టే - యివన్నీ సుబ్బావధాన్లు యే స్కూల్లోనూ చదువుకోలేదు. తండ్రి శేషావధాన్లు, అన్న నాగభూషణంతో పాటు తిరగడం వల్ల సంక్రమించిన వారసత్వపు విజ్ఞానం.

మూడు తరాలుగా శేషావధాన్లుగారింట యీ బ్రాహ్మణీకం నడుస్తూనే వుంది. మడీ, తడీ, ఆచారం – ఉదయము సాయంత్రము సంధ్యావందనం – యిక చెప్పనలవి కాదు. ఆడవాళ్ళు కూడా మూసివాయనాలకీ, పెళ్ళిళ్ళకీ యథా ప్రకారం వెళ్ళేవారు...

ఒక్క మాటలో ఆ కుటుంబంలో వంశ మర్యాదల్నీ, అలవాట్లనీ అసహ్యించుకున్న వాళ్ళుగానీ అతిక్రమించిన వాళ్ళుగానీ లేరు. కాలం వొక్కతీరున వుండదంటారు. ప్రపంచ గమనం మారడం, మారకపోవడం సంగతి వొదిలి ఆలోచిస్తే మనిషి బుద్ధి తర తరాలుగా నడుస్తూన్న ధోరణి వదిలి వింతదారుల వెంట పరిగెత్తడం ఆశ్చర్యం యేమీ కాదు. అపరాధం అంతకన్నా కాదు.

శేషావధాని పెళ్ళిళ్ళ మధ్యా తద్దినాల్లోనూ చమక్ చమక్‌గా యింగ్లీషు మాటలు వదిలి ఖాతాదారుల యిళ్ళల్లో స్థిరనివాసం మరింత గట్టి చేసుకుని తన తర్వాత ఆయా యిళ్ళల్లో తన కొడుకుల కోసం కొంత ప్రేమాభిమానాలు దొరికేటట్టు పునాదులు వేశాడు...

పెద్ద కొడుకు నాగభూషణం చాలా మటుకు తండ్రి పోలిక. స్కూలు ఫైనల్ వరకూ చదివినా క్రాఫ్‌తో పాటు పిలక వుంచుకున్నాడు. పెళ్ళిళ్ళకీ శ్రాద్ధకర్మలకీ పంచె కట్టుకుని ధైర్యంగా అందరిళ్ళకీ తిరిగేవాడు.... మర్నాడు అంత ధైర్యంగానూ స్కూల్‌కీ వెళ్ళేవాడు.

సుబ్బావధాన్లు స్వతహాగా బిడియపు మనిషి.... యింట్లో కూర్చుని తండ్రి చెప్పిన అష్టోత్తరాలూ, పూజా విధానాలూ, సామవేదం చదివినా – ఏ శివాలయంలోనూ నలుగురి ముందూ చదవటానికి మొండికేశేవాడు.

కార్తీక మాసంలో గోదావరి స్నానాలకి వెళ్ళి – అక్కడికి వచ్చిన ఆడంగులకి చేతిలో పసుపూ కుంకుమా పెట్టి మంత్రాలు చదవడానికి ఒప్పుకొనేవాడు కాదు.

"పెద్దాడిలా కాదు. వీడు మన ఆచారాల్ని పాటించేటట్టు లేదు. యెలానో" లక్ష్మీదేవి బాధపడుతూ అనేది భర్తతో.

"వెధవని నాలుగు తన్నితే సరి. బొట్టు చెరుపుకుంటేనూ, పిలక కత్తిరించుకుంటేనూ బ్రాహ్మలం కాకుండా పోతామా? ఎవడి కులం వాడిది."

ఆ మర్నాడు తహసిల్దారు గారింట్లో సత్యన్నారాయణ వ్రతకల్పం జరుగుతోంది. శేషావధాన్లు బలవంతంగా సుబ్బావధాన్ల చేత ఆరేసిన పంచె కట్టించి, భుజాన ఓ తుండు విసిరి, వీధిలోకి గెంటు కెళ్ళాడు....

తహసిల్దారుగారింట్లో హడావుడిగా వుంది. శేషావధాన్లని చూసి అంతా "త్వరగా వ్రతం కానియ్యండి – ఆకలితో మా ప్రాణాలు పోతున్నా" యంటూ గొడవ మొదలుపెట్టారు.

శేషావధాన్లు మొదట వ్రతం, పూజా మొదలు పెట్టాడు.... మధ్య మధ్య ఆయాసం వచ్చినప్పుడు సుబ్బావధాన్లుని మోచేత్తో ఓ పోటు పొడిచి 'చెప్పు' అన్నట్టు సంజ్ఞ చేశాడు.

సుబ్బావధాన్లు.... యెక్కడో చూస్తూ పూజా నామాలు చదవడం మొదలు పెట్టాడు.... అతనికి అప్పుడు అక్కడ కలశం వున్నట్టూ, ఆ కలశం కింద ముగ్గులు వున్నట్టూ, ఆ

ముగ్గుల చుట్టూ తమలపాకులు వున్నట్టూ తోచడంలేదు. అతనికి యెదురుగా ఆడవాళ్ళ ముందు కూర్చున్న అరుణ కన్పిస్తోంది. అరుణ తహసీల్దారుగారి అమ్మాయి. పైగా సుబ్బావధాన్లు క్లాస్‌మేట్.

అరుణ నవ్వుతూ తనవైపే చూస్తుంటే సుబ్బావధాన్ల గుండెల్లో గునపాలు గుచ్చుతున్నట్టే వుంది.

ఆ మర్నాడు స్కూల్లో అరుణ తన స్నేహితురాళ్లతో

"ఆ అబ్బాయేనే - అదే - ఆ గుండు అబ్బాయి - నిన్న మా యింటికి వచ్చి పూజ చేయించాడే.... మా నాన్నగారు వాళ్ళకి డబ్బులిచ్చారు."

"హేయ్, హేయ్" యిద్దరు ముగ్గురు పిల్లలు "బ్రాహ్మడు, బ్రాహ్మడు" అంటూ గేలి పట్టించారు.

సుబ్బావధాన్లుకి కళ్ళవెంట నీరు తిరిగింది.

మర్నాడు స్కూలుకి పోనని యింట్లో భేటీ వేసుకున్నాడు.

హాయిగా తండ్రితో వెళ్ళి తోడుగా వుండమంది. దానికీ సుబ్బావధాన్లు ఒప్పుకోలేదు.

శేషావధాన్లు సుబ్బావధాన్లుని చితకకొట్టాడు..... రెండు పూటలు అన్నం పెట్టడం మానేశాడు... అప్పుడూ మాట వినకపోతే వీధి గదిలో పెట్టి గొళ్లెం పెట్టేడు...

తెల్ల తెల్లవారుతూంటే లక్ష్మీదేవి కడుపుతీపి ఆపుకోలేక కొడుకు కోసం వీధిగది తలుపు తెరవబోయింది.... కాని, అప్పటికే ఆ గది వుతకలు యెత్తేసి వున్నాయి. గది ఖాళీగా వుంది. సుబ్బావధాన్లు మాత్రం లేడు.

యింట్లోంచి పారిపోయిన సుబ్బావధాన్లు హైదరాబాద్ వచ్చాడు.... నిజానికి సుబ్బావధాన్లుకి హైదరాబాద్ అనే వూరు ఒకటి వుందని తెలియదు. యింట్లోంచి వీధిలోపడి, ఆపైన రైలెక్కి, రైల్లోంచి దింపేస్తే మరో రైలెక్కి, వారం నాటికి అతను హైదరాబాద్‌లో తేలాడు. అప్పటికింకా హైదరాబాద్ నైజాం నవాబుగారి హస్తంలోనే వుంది.

సుబ్బావధాన్లు వూరంతా తిరిగితే అతనికి కాళ్ళు పీకాయి తప్ప - ఓ దారీ తెన్నూ కనపడలేదు. తనకే తెలిసిన తెలుగులో మాట్లాడబోతే వెక్కిరింతలు యెదురయ్యాయి. తిరగ్గా తిరగ్గా సుబ్బావధాన్లకి సికింద్రాబాద్‌లో ఓ తెలుగు మనిషి కన్పించాడు... ఆయనపేరు రామావతారం.

'అన్నం తిని మూడు రోజులయింది' అన్నాడు సుబ్బావధాన్లు.

ఆ తెలుగాయన సుబ్బావధాన్లుని ఇంటికి తీసుకువెళ్ళి అన్నం పెట్టాడు - అలాగే రెండు రోజులు గడిచాయి....

"నేను స్కూల్ ఫైనల్‌దాకా చదివాను... నాకు నౌఖరీ చూపించండి" అన్నాడు జాలిగా.

"ఏం నౌఖరీ చేస్తావు?"

"ఏదైనా..."

"నేనూ యీ వూరు వచ్చి రెండు నెల్లే అయింది. నాకూ యెవరూ తెలియదు. నాకూడా వచ్చావంటే ఏ గుడిలోనో కుదురుస్తాను. నాలుగిళ్ళలో పౌరోహిత్యం చేసుకో. చూస్తే మనవాళ్ళ కుర్రాడిలా వున్నావు" అన్నాడు రామావతారం.

సుబ్బావధాన్లుకి యేం సమాధానం చెప్పాలో తెలియలేదు. కళ్ళముందు అరుణ కదిలింది.

"నేను పౌరోహిత్యం చేయను. నేను చదువుకుంటాను" అనాలనుకున్నాడు. కాని ఆకలి, ఒంటరితనం, భయం గొంతు నొక్కేశాయి.

"సరే" అన్నాడు.... సుబ్బావధాన్లు.

❖ ❖ ❖

మనిషిలో కోరిక వుంటుంది. దానికి పట్టుదల జోడీ అయితే చెప్పాల్సిందేం వుండదు. మనిషిని యెంత దూరమైనా తీసుకు వెడుతుంది.

సుబ్బావధాన్లు పౌరోహిత్యం చేసుకుంటూ, రామావతారం యింట్లో వుంటూ రాత్రిపూట చదువుకుంటూ, వున్నాడు. వున్ననాడు తినీ లేనినాడు పస్తులుండీ ఐదేళ్ళు గిర్రున తిరిగేసరికి బి.ఏ. అయ్యాడు. రామావతారం బ్రతిమలాడగా అతను పౌరోహిత్యం వతనుగా చేయించే ఆఫీసరు సుబ్బావధాన్లుకి యల్.డి.సి. ఉద్యోగం యిప్పించాడు.

"మీరు చాలా ఉపకారం చేశారు సార్.... నేను మీకెంతో ఋణపడి వున్నాను" అన్నాడు సుబ్బావధాన్లు.

"దానిదేం వుంది... అర్హత వుంది కాబట్టి వుద్యోగం వచ్చింది నీకు..." అన్నాడు రామారావుగారు.

"వెడతాను, సార్..."

రామారావు యేదో ఆలోచించి, ఆపైన గుర్తొచ్చినట్టుగా మొహం పెట్టి "చూడు, యెల్లుండి మా యింట్లో మావాడి బారసాలా, సత్యన్నారాయణ వ్రతం వుంది.... కొంచెం వచ్చి ఆ పూజ కాస్తా గట్టెక్కించు... రామావతారం వూళ్ళో లేడని తెలిసింది.... యేమీ అనుకోకు..."

సుబ్బావధాన్లుకి యేం చెప్పాలో తెలియలేదు. అప్పటికే ఆఫీసులో చాలామంది అతన్ని పరోక్షంగా వేళాకోళం చేస్తూనే వున్నారు.

"నా పెళ్ళి మీరే చేయించాలి. వుద్యోగం లేనప్పుడు మీరు చాలామంది పెళ్ళిళ్ళు చేయించారటగా" అంది నవ్వుతూ స్టెనో శ్యామల.

"పెళ్ళి ఒకటే కాదు, రేపొద్దున మనకేమైనా ప్రమాదం జరిగినా సుబ్బావధాన్లే గతి" కొలీగ్ వేళాకోళంగా అన్నాడు.

'గురూ! విడాకులకి మంత్రాలు లేవా' యెవరో వ్యంగ్యంగా అడిగారు.

సుబ్బావధాన్లు తలవంచుకున్నాడు... అతనికెందుకో తన గతం అంటే అసహ్యం

పోలేదు. అతనికి గతం చెరిపేసుకోవాలని కోరిక. తన అధైర్యమే తన శత్రువవుతోందనీ, యీ ఆలోచన మూలంగానే తను కిందా మీదా పడుతున్నాననీ అతను అర్థం చేసుకోలేక పోయేవాడు.

"నేను పుట్టుకతో బ్రాహ్మణ్ణి.... పూజా పునస్కారాలు చేయడం, చేయించడం మా అలవాటు. వుద్యోగాలు చేస్తున్నా, పై పదవుల్లోకి పోయినా యెవరూ కులం కట్టుబాట్లు తెంపుకోలేరు. ఆరువందలు సంపాదించే ఆఫీసరు పొలానికి వెళ్ళి గట్లు తవ్వి - కొట్టివేతలూ కుప్పమార్పులూ చూడ్డం నేరమని యే వివేకీ అనడు. పుట్టుకతో వచ్చిన విద్య... ముందు ముందు బ్రతుకులో క్షణ క్షణానికీ ప్రతీకగా నిల్చి వెన్నులో పోటు రగల్చడం, కళ్ళలో నీరు చిమ్మించడం, యిదంతా యేమిటీ" అంటూ అరచిగానీ, పైకి అనిగానీ చేయలేకపోయేవాడు.

తన స్నేహితుల్లో అతికొద్ది మంది అలా మాట్లాడుతుంటే న్యాయవిచక్షణ చేస్తుంటే సుబ్బావధాన్లు చూస్తూ వూరుకునేవాడు.

❖ ❖ ❖

సుబ్బావధాన్లు మొహంలో కత్తినాటుకి నెత్తురు చుక్కలేదు.

ఆఫీసుకి వెళ్ళేసరికి - ఆరోజు చేయబోయే అర్జంటుపని యేమిటో చెప్పకుండా రామారావుగారుతన పెర్సనల్ సెక్రటరీ చేత శ్రీముఖం అందజేశాడు.

నువ్వు ఆఫీసుపనిలో మందగొడితనం ప్రోత్సహిస్తున్నావు. పనిని నెలల తరబడి ముగగపెడుతున్నావు. నిన్నెందుకు సస్పెండు చేయకూడదో, యిరవై నాలుగు గంటల్లోగా లిఖితపూర్వకంగా సమాధానం యివ్వని పక్షంలో, నువ్వు నీ తప్పుల్ని వప్పుకున్నట్టే భావించడం జరుగుతుంది - అని అందులో సారాంశము.

సుబ్బావధాన్లు రామారావుగారిని ముఖతా కల్సుకుందుకు - నోరువిప్పి సమాధానం విన్నవించుకుందుకు అవకాశం దొరకలేదు.

వురుములు లేకుండా పిడుగులు పడ్డం అంటే యేమిటో - మబ్బులు లేకుండా తుఫాను యెలా వస్తుందో ఆ రోజే అతనికి తెలిసింది. అందుకే యింటికి వెళ్ళకుండా రామావతారం దగ్గరికి వెళ్ళి కళ్ళనీళ్ళు పెట్టుకున్నంత పనిచేసి వంచిన తల యెత్తకుండా బాధని దిగమింగుకుంటూ అన్నీ చెప్పాడు.

రామావతారం అంతా విని -

"తప్పు నీది... అయ్యగారికి కోపం తెప్పించావు... వెళ్ళి ఆ పూజా పునస్కారాలు చేయిస్తే నీకు పరువు తక్కువా? వారి మాట కాదంటే నీకు కిరీటాలు పెట్టేదెవరు? నువ్వెంత చెరిపేసుకున్నా నీ బ్రాహ్మణ పుట్టుక పోతుందా? నీ నోట్లో వున్న ఆ నాలుగు ముక్కలూ నువ్వెంత గింజుకుంటే మాత్రం బయటకు పోతాయా?"

"అది కాదండీ..."

"నువ్వేం చెప్పకు – నీ పద్ధతి ముందు నుంచీ నాకు నచ్చలా. నువ్వేదో అవమానప్పని చేసినట్టు యెందుకలా బాధపడతావు... చదువులతో తల పెరగాలి తప్ప కొమ్ములు మొలవకూడదు. కళ్ళు నెత్తికెక్కిన వాళ్ళు అవాకులూ, చవాకులూ పేలతారని భయంచేత కాకపోతే – నువ్వు మనస్ఫూర్తిగా చెప్పు.... వేదం చదవడం సహస్రనామాలు పఠించడం, వెకిలి కబుర్లుకన్నా తీసిపోయాయా? గొట్టం పేంట్లు, జులపాలకన్నా పిలక నాగరీకం కాకుండా పోతుందా? ఇంగ్లీషువాడు గుండు చేయించుకుంటున్నాడు. హరే కృష్ణమతం తీసుకున్న అమెరికా దొరలంతా చలిమిడి గుండుతో న్యూయార్కు నడిబొడ్డులో భరతనాట్యం చేయడంలా?"

సుబ్బావధాన్లు నమ్రతగా అన్నాడు.

"మీరే యీ గండం గట్టెంక్కించాలి."

"దీనికి వొకటే దారి.... అమ్మగారిది మెత్తటి మనసు. యెదుటివాళ్ళ కష్టానికి కరిగిపోయే నవనీతం లాంటిది, ఆవిడ తత్వం... వెళ్ళు, నేను పంపించానని చెప్పు, చేతులు కావను... ఆ... ఆ... అలా అని ఆవిడగారి చేతులు పట్టుకునేవు నీ అదృష్టం బావుంటే – ఆవిడ హృదయం కరిగితే– కరక్కమానదు. నీ నౌఖరీ నీకు దక్కుతుంది. లేదంటావా నీదారి నువ్వు చూసుకుందువుగాని. నీ పొట్ట నువ్వే నింపుకుందువుగాని. నీ బ్రతుకుదెరువుకి నువ్వే నీకు నచ్చిన పద్ధతి అవలంబిద్దువుగాని. వెళ్లు... వేగిరం వెళ్ళు... అయ్యగారు యింటికి రాకుండా వెళ్ళు. ముచ్చటగా మూడు మాటల్లో నీ కంఠశోష మొదలెట్టు..."

❖ ❖ ❖

సుబ్బావధాన్లుకి ద్వారక ప్రయాణం వెడుతున్న కుచేలుడు గుర్తొచ్చాడు. వెయ్యి చదరపు గజాల ఆవరణలో వున్న లేటెస్టు మోడల్ హౌస్ అతనికి ప్రెసిడెంటు భవనంలా అన్పించింది.

నిశ్శబ్దం రాజ్యం చేస్తున్న ఆ యింటి గుమ్మం యెక్కుతూ యెందుకైనా మంచిదని వూపిరి బిగబట్టాడు, గౌరవసూచనగా సుబ్బావధాన్లు – కొద్ది నిముషాలు. ఆ తరువాత హాల్లోకి వెళ్ళి యేం చేయాలో తోచక సోఫాసెట్లనీ, హాల్లోవున్న ఫొటోల్నీ, నేలమీద పరిచిన తివాసీల్నీ, కిటికీల్నీ, వాటికున్న వూచల్నీ లెక్కకట్టాడు.

యింతలో లోపలి నుంచి "యెక్కడున్నావే మంగమ్మా" అంటూ హాల్లోకి వచ్చిన శ్రీమతి రామారావుని (మనిషిని చూసీ, కట్టుకున్న చీరను చూసీ, వయసుని అంచనా వేసి, రామారావుగారి భార్యే అయ్యుంటుందనుకొని) చూసి

"నమస్కారం" అన్నాడు.

సుబ్బావధాన్లుని చూసి ఆవిడ ఆశ్చర్యపోయినట్టు మొహంపెట్టి 'మీరు' అనబోయి ఆపైన ముందుగా కుర్చీలో కూర్చోండన్నట్టు సంజ్ఞచేసి – కొంచెం తెప్పరిల్లి "మీరు" అంది.

"నేను ఆఫీసులో పనిచేస్తున్నానండీ" అన్నాడు.

"అంటే" అంది...

"అదే.... రామారావు గారి దగ్గర..."

"ఆయన యింట్లో లేరు.... యింకా రాలా...."

"అందుకనే వచ్చాను" నాలిక కరుచుకున్నాడు.

యీసారి శ్రీమతి రామారావు మాట్లాడలేదు.

"మొన్న మీ యింట్లో బారసాలా, సత్యన్నారాయణ వ్రతం.."

ఆవిడ అదోలా మొహం పెట్టి... "యేం చెప్పేది... ఈయనగారు చెప్పిన ఆ బ్రాహ్మడు కాస్తా రాకుండా పోయే... నానా రభసా అయిపోయింది..."

"నా మూలంగానేనండీ... తప్పు నాదే..."

శ్రీమతి రామారావు చూస్తూ వుండిపోయింది.

"నేను... నామూలంగానే వారికి కోపం వచ్చింది.... నా మూలంగానే మీ యింట శుభకార్యం ఆగిపోయింది....దాంతోనే నా వుద్యోగం పోయేటట్టుగా వుంది...."

"అరెరె..."

"మీరెలాగైనా వారికి కాస్త నచ్చచెప్పాలి... నన్ను రామావతారం పంపారు. మీరు చెబితే వారు వింటారుట. యీ వుద్యోగంపోతే... నేను మళ్ళీ..." సుబ్బావధాన్లు ఆగిపోయాడు...

"నేనే చెప్పాలా..."

"అవునండీ..."

"మీకు వేరే ఆస్థిపాస్తులేం లేవా?"

"సున్నా...."

"అలానా..." అని ఆగిపోయి, "మరి మీ గురించి వారితో నేను చెబుతాననుకోండి. కాని, తప్పు మీమీదుంది. యింతకీ మీరు ఆ వేళ యెందుకు మా యింటికి రాలా. ఒకవేళ మీకిష్టం లేకపోతే.... ముక్కుకి సూటిగా వారితో చెప్పొచ్చుగా." సుబ్బావధాన్లు బేలమొహం వేసుకుని తలవంచుకుని వింటున్నాడు.

యింతలో బయటనుంచి "అరుణమ్మగోరూ... వంకాయలు శానా ప్రియంగా వున్నాయండీ. దోర బీరకాయ లగబడితే అట్టుకొచ్చానండీ" అంటూ దాసీది రంగప్రవేశం చేసింది.

అరుణ అనే శ్రీమతి రామారావు, సుబ్బావధాన్లు మొహంలోకి చూడ్డం, సుబ్బావధాన్లు యెవరో వెన్ను చరిచినంత వేగంగా అరుణ కళ్ళల్లోకి చూడ్డం జరిగింది.

❖ ❖ ❖

ఆఫీసరు రామారావుగారు పిలుస్తున్నారని కబురు అందగానే, సుబ్బావధాన్లు పటికిపోయాడు... సగం కీ వున్న బొమ్మలా అప్రయత్నంగా రామారావుగారి గదిలోకి

ప్రవేశించాడు.

ఆఫీసు కాగితాలు చూస్తోనూ, కళ్ళజోడు సర్దుకుంటూ సంతకాలు చేస్తూనూ, ఫోన్‌లో మాట్లాడుతూనూ రకరకాల ముఖాభినయం చేస్తూ చాలాసేపు రామారావు – సుబ్బావధాన్లని చూడనట్టే వుండిపోయి – ఆ తరువాత 'సారీ' అని – మళ్ళీ ఫ్రెష్ వాటర్ సిప్‌చేసి 'వాట్' అన్నాడు.

సుబ్బావధాన్లుకి నటన విషయంలో అనుభవంలేని మూలంగా పోర్షన్ మరిచిన నటుడిలా నేలా నింగీ చూడ్డం మొదలుపెట్టవల్సి వచ్చింది.....

"యిప్పటికే యీ ఆఫీసులో స్టాఫ్ యెక్కువయిందని పైనుంచి నాకు రోజూ గూటింపు వస్తోంది. జూనియర్ మోస్ట్‌ని రిట్రెంచ్ చెయ్యడం ధర్మం... అంతే గాని....నువ్వేదో... మా ఆవిడ చెప్పింది..."

"నేనన్నది అది కాదండీ... నాకు... నేను..."

"అవుననుకో... సరే... నా శక్తి కొద్దీ ప్రయత్నిస్తాను... .యేదో బుద్ధిమంతుడివి కదా అని యీ కన్సెషన్" కళ్ళలోకి చూస్తూ అన్నాడు రామారావు.

"థాంక్స్, సార్"

"అది సరే... నాదో అనుమానం.... నువ్వు ఆర్థడాక్స్ అనుకున్నాను, యింకా బ్రాహ్మడివయుండి మాంసాహారం చేస్తావుట... డ్రింక్ పార్టీలూ అవీ దొరికితే వదిలిపెట్టవుట..." నవ్వుతూ అంటున్నాడు...

సుబ్బావధాన్లుకి టేబుల్ మీద ఫేన్ మెదడులోకి జొరబడ్డట్టయింది...

"యీ రోజుల్లో మనవాళ్ళు చాలా మంది యిలా తయారవడానికి కారణం యేమిటంటావు?... జంధ్యాలు వుంచుకోరు.... సమయం చిక్కితే చాలు కోడి కూరా, పలావ్ వదిలిపెట్టడం లేదు... బ్రాహ్మణీకం యేమయిపోతుందంటావు?"

"చెడేనండి మరి...."

"నేనూ, నా ఫ్రెండ్స్‌ని చాలామందిని చూశాను. అందరూ యింతే... మన మేం చేస్తాం..."

సుబ్బావధాన్లు చేతులు కట్టుకొని శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాల కవిత్వం అర్థంకాని ద్వారపాలకుడిలా వుండిపోయాడు.

"అది సరే... మాంసాహారం అలవాటయింది అనుకో... మరి... అప్పటి నుంచి యిలా పూజలూ పునస్కారాలూ చేయించకూడదనుకున్న నీ నిర్ణయం కూడా మంచిదే... కాని, ఆ మాట ఆ రోజే నా చెవిని వేసుండాల్సింది... చూస్తే నీకు దైవభక్తీ, పాపభీతి యెక్కువనుకుంటాను..."

"అవునండి..."

రామారావు నవ్వేశాడు. "అసలు నాకెందుకు కోపం వచ్చిందంటే నువ్వు డిగ్నిటీ

ఫీలయి మా యింటికి రావడం మానేశావని. నిన్ను ఆఫీసులో అందరూ వేళాకోళం చేస్తున్నారని నాకు తెల్సు.... చూడు మిస్టర్... మనం వద్దనుకున్నా యీ దేశంలో కులాల గోల త్వరగా పోయేట్టు లేదు యెవరి కులంలో లోపాల్ని వాళ్ళు తరిమి కొట్టాలి.... అంతేగాని నీ అలవాట్లని చూసి నువ్వు సిగ్గుపడాల్సిందేం లేదు. పూజా పునస్కారాలు చేయించినంత మాత్రాన నువ్వు నేరస్తుడివి కావు.... అవునా..."

"నిజమే...."

"మరి అసలు విషయం... నాకు తెలియక అడుగుతున్నాను, కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు ప్రోత్సహించాల్సిన ఈ రోజుల్లో భోజన అలవాట్లలో అటూ యిటూ అయితే తప్పేమన్నా వుందంటావా? మాంసాహారం మనకి నిషిద్ధం, అంతేగాని మాంసం తింటే నరకానికి పోతామని యే శాస్త్రం చెబుతోందంటావు?"

అలా చాలాసేపు సంభాషణ నడిచింది... కాశ్మీరు పండితులు మాంసాహారులనీ, బెంగాల్ బ్రాహ్మలు చేప అంటే ప్రాణం పెడతారనీ యేవేవో చెప్పాడు రామారావు...

సుబ్బావధాన్లు తిరిగి తన సీట్లో కూర్చున్నా అతనికింకా రంగులరాట్నం యెక్కి దిగినట్టుగానే వుంది. మనిషిని కాసేపు మాయం చేసి పది నిముషాల పాటు మరోలోకంలో నిలబెట్టి ఆ పైన వాపసు పంపించినట్టుగా వుంది.

అంతేగాని పాపం – ఆ సమయంలో అరుణ అనే శ్రీమతి రామారావు సుబ్బావధాన్లుకి గుర్తు రాలేదు.

యెప్పుడో చిన్నప్పుడు తనని నలుగురి ముందూ అవమానపర్చిన విషయం అరుణ మర్చిపోలేదనీ – యిప్పుడు అందుకోసమే యీ వుపకారం చేసిందనీ అతను వూహించలేదు....

రామారావు గదిలోంచి వచ్చే ముందు "డిగ్నిటీ ఆఫ్ లేబర్" అనేమాట మర్చిపోవద్దని, ఆయన చేసిన హెచ్చరిక మాత్రం గుర్తొచ్చింది. సంవత్సరాలుగా తన తల్లిదండ్రుల మీద, కులం మీద వున్న అక్కసు తగ్గించుకోవడం మంచిదని మాత్రం నిర్ణయించుకున్నాడు ఆ క్షణాన్నే సుబ్బావధాన్లు.

❖